టమాటా పంటలను పరిశీలించిన అధికారులు

- సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన 7

ఓటరు జాబితా విడుదల

- నారాయణరావుపేట పెండింగ్
- 28న తుది జాబితా...

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 13: గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం కనిపించకపోయినా అధికార యంత్రాంగం మాత్రం ఏర్పాట్లు పూర్తిచేస్తోంది. అందులో భాగంగానే శుక్రవారం జిల్లా అధికార యంత్రాంగం ఓటరు జాబితాను విడుదల చేసింది. ఆ జాబితాను ఆయా గ్రామపంచాయతీలలో నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. జిల్లాలో 499 గ్రామ పంచాయతీలుండగా అందులో మల్లన్నసాగర్‌లో ఏడు గ్రామ పంచాయతీలు, 66 వార్డులు ముంపునకు గురయ్యాయి. ఇటీవల కొత్తగా జీపీల ఏర్పాటుకు గెజిట్ విడుదల చేశారు. కొత్త వాటితో పాటు 514 గ్రామపంచాయతీలు, 4,566 వార్డులు ఉన్నాయి. జిల్లాలోని గ్రామాల్లో మొత్తం 6,16,009 ఓటర్లు ఉన్నారు. పురుషులు 3,03,141 మహిళలు 3,12,861, ఇతరులు ఏడుగురు ఉన్నారు. అయితే తాజాగా 491 గ్రామపంచాయతీలలోని 4,350 వార్డుల జాబితాను విడుదల చేశారు. సాంకేతిక సమస్యతో సిద్దిపేట అర్బన్ మండలంలోనీ గ్రామాలు నారాయణరావుపేట మండలంలో నమోదు కావడంతో త్వరలోనే ఈ జాబితాను, మిగిలిన గ్రామాల జాబితాను విడుదల చేయనున్నారు.

నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ

ఈనెల 14 నుంచి 21 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 19న జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో, 26న మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో అభ్యంతరాలను పరిష్కరించి 28న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తారు.

సరిచూసుకోవాలి

దౌల్తాబాద్/మద్దూరు/చేర్యాల/కుకునూరుపల్లి: గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించిన మొదటి ఓటరు జాబితాలో పేర్లను, తప్పొప్పులను సరిచూసుకోవాలని దౌల్తాబాద్ ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, మద్దూరు ఎంపీడీవో రాంమోహన్, చేర్యాల ఎంపీడీవో కుమారస్వామి సూచించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో జాబితాను ప్రదర్శించారు.



దౌల్తాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ

సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, బుస్సాపూర్ గ్రామాల్లో సర్పంచ్ పదవి ఆశిస్తున్న ముగ్గురేసి అభ్యర్థులు గ్రూపులుగా ఏర్పాటై చందాలు, విరాళాలు అందిస్తున్నారు. శుభ, అశుభ కార్యాలకు తమ వంతు సాయం చేయడానికి పోటీపడుతున్నారు. ఏడాదిగా నువ్వా నేనా అన్నట్లుగా గ్రూపులు కడుతున్నారు.

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ పదవి ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. రోజూ దావత్‌లు జరుగుతున్నాయి. ఆశావహులు సొంత డబ్బులతో వినాయక విగ్రహాలు, వైకుంఠరథాలు, క్రికెట్ కిట్లు అందించారు. చావులు, పెళ్లిళ్లకు సొంతంగా సాయం చేస్తున్నారు. ఇదే మండలంలోని మరో మూడు గ్రామాల్లోనూ ఆశావహులు పోటాపోటీగా ఖర్చు పెడుతున్నారు.

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన రవి యాదవ్ అనే యువకుడు తనను సర్పంచ్‌గా గెలిపించాలని కోరుతున్నాడు. ఇతర పనులతోపాటు వీధి దీపాలకు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకొచ్చాడు. ఇక కౌడిపల్లిలోనూ సర్పంచ్ రేసులో ఉన్న ఇద్దరు వేర్వేరు పార్టీల నేతలు గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల సాయం చేస్తున్నారు.

నేనే సర్పంచ్..!

ఎన్నికలకు ముందే పోటాపోటీ తాయిలాలు

- ఖర్చులకు వెనుకాడని ఆశావహులు
- గ్రామాల్లో పనులకు సొంత డబ్బులు
- విరాళాలు, విహారాలు, విందులతో ఆకర్షణ
- ఏడాది కాలంగా ఇదే తంతు..
- కులగణన దృష్ట్యా మరో 3 నెలలు తప్పని ఖర్చులు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, సెప్టెంబరు 13: గ్రామాల్లో ఓటర్లను ఆకట్టుకోవడానికి ఆశావహులు విభిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ పనైనా చేయడానికి సిద్ధం అంటున్నారు. ఇటీవల రుణమాఫీ జరగని రైతులకు అండగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రూ.500కే సిలిండర్, ఉచిత విద్యుత్ అందనివారి జాబితా తీసుకొని అమలయ్యేలా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు వ్యక్తిగతమైన పనులకూ చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకర్షించడానికి క్రికెట్‌మ్యాచ్‌లు నిర్వహించడం, వినాయక విగ్రహాలు పెట్టించడం, దుర్గామాత వేడుకలకు ప్రణాళికలు సిద్ధం చేయడం, బతుకమ్మ, దసరా సందర్భంగా బహుమతులు ఇవ్వడంపై దృష్టిపెట్టారు.

గ్రామపంచాయతీల వివరాలు

జిల్లా	గ్రామాలు	వార్డులు	పల్లె ఓటర్లు
సంగారెడ్డి	658	5,834	8,36,370
సిద్దిపేట	514	4,566	6,16,009
మెదక్	491	4.232	5,14,705

మేమున్నామంటూ..

- నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో తాజామాజీ ఎంపీటీసీ భానుచందర్ నిరుపేదల పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు అందిస్తున్నారు.
- మునిపల్లి మండలంలోని మల్లిఖార్జునపల్లి, అల్లాపూర్, చిన్న చల్మెడ, మునిపల్లి గ్రామాల్లో ఆశావహులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు.
- ధూళ్మిట్టలో ఒకరు పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు, నిరుపేదలు చనిపోతే రూ.5వేలు, ఆలయాల అభివృద్ధికి సహకరిస్తున్నారు.
- జిన్నారం మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్‌గా ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ అనుచరులను గోవా, తదితర ప్రాంతాలకు విహారానికి తీసుకెళ్లారు.
- మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలో ఒకరు స్థానిక పాఠశాలలో రూ.6లక్షలు వెచ్చించి సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. కోనాయపల్లిలో ఇద్దరు అభ్యర్థులు ఆలయాలకు, విగ్రహాలకు పోటాపోటీగా ఖర్చు చేస్తున్నారు.
- మాసాయిపల్లి మండలం రామంతపూర్, బొమ్మారం, పోతన్‌శెట్టిపల్లి, అచ్చంపేట, కొప్పులపల్లి గ్రామాల్లో వినాయక విగ్రహాలకు విరాళాలు, అన్నదానాలు చేస్తూ తాము కూడా రేసులో ఉన్నామంటున్నారు ఆశావహులు.
- కుకునూరుపల్లి మండలంలోని ఓ రెండు గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీచేయాలనుకున్న ఆశావహులు ఆ గ్రామానికి చెందిన పెద్దమనుషులు, యువకులను వేర్వేరుగా విహారయాత్రలకు తీసుకెళ్లారు.
- వర్గల్ మండల కేంద్రంలో సర్పంచ్ రేసులో ఉన్న నాయకుడు ఇటీవల వర్షానికి బురదమయమైన కాలనీలో తన సొంత డబ్బులతో మట్టిపోయించి చదును చేయించారు.

రిజర్వేషన్లు మారితే ఆగమే..

ఈ ఏడాది జనవరి నెలతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. తిరిగి ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి, గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఇంతలో పార్లమెంటు ఎన్నికలు రావడంతో కుల గణన జాప్యమైంది. సెప్టెంబరు నెలలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించడంతో మళ్లీ ఆశలు ఊపందుకున్నాయి. తాజాగా ఎన్నికల నిర్వహణపై హైకోర్టు ప్రశ్నించగా మరో 3 నెలల సమయం కావాలని ప్రభుత్వం కోరింది. ఈ లెక్కన సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు గడిస్తే డిసెంబరులో ఎన్నికలు జరుగుతాయని అంచనా. అప్పుడు కూడా ఇవే రిజర్వేషన్లు కొనసాగుతాయా.. మారుతాయా.. అనే విషయంపై స్పష్టత లేదు. రిజర్వేషన్లు తమకే అనుకూలంగా ఉంటాయని ఎడాపెడా ఖర్చుచేస్తున్న ఆశావహుల పరిస్థితి అటుఇటైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. కానీ, ఆశావహులు మాత్రం రిజర్వేషన్లు మారితే వార్డు సభ్యుడిగా గెలిచి ఉప సర్పంచ్ పదవి చేపట్టవచ్చని ఆశతో ఉన్నారు. లేదా, ఎంపీటీసీగానైనా పోటీలో ఉండొచ్చని నమ్మకాన్ని ప్రదర్శిస్తున్నారు.

మీకోసమే మైత్రి

- ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక వార్డు
- సిద్దిపేట జీజీహెచ్‌లో త్వరలోనే అందుబాటులోకి
- ప్రతీ మంగళవారం ఓపీ విభాగం
- జిల్లా వ్యాప్తంగా 80 మంది ట్రాన్స్‌జెండర్లు

సిద్దిపేటటౌన్, సెప్టెంబరు 13: సమాజంలో స్త్రీ, పురుషులకు అందిస్తున్న మాదిరిగానే సమానత్వ వైద్యాన్ని ట్రాన్స్‌జెండర్లకూ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా సుస్తు చేస్తే ట్రాన్స్‌జెండర్‌లు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో వారి ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకున్న ప్రభుత్వం మైత్రి క్లినిక్ పేరిట ఉచితంగా వైద్యసేవలను అందించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆ మేరకు వైద్యులు, సిబ్బంది తదితర వాటిని సమకూర్చింది. దీంతో ట్రాన్స్‌జెండర్లకూ త్వరలోనే వైద్యసేవలు అందనున్నాయి.

మెరుగైన వైద్యసేవలు



జిల్లావ్యాప్తంగా 80 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అధికారికంగా 54 మందిని గుర్తించిన అధికారులు ఇతర జిల్లాల నుంచి 30 మందికి పైగా ఉండొచ్చనే చెబుతున్నారు. పట్టణంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో మైత్రి క్లీనిక్ అందుబాటులోకి వచ్చినట్లయితే జిల్లాలోని 80 మందికి పైగా ట్రాన్స్‌జెండర్లకు వైద్యసేవలు పొందనున్నాయి. వారికి ఆసుపత్రిలో ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తూ, ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 80 మందే కాకుండా అధికారుల దృష్టికి రానివారు కూడా మైత్రి క్లినిక్‌లో వైద్యసేవలు పొందొచ్చని సూచిస్తున్నారు.



సిద్దిపేటలోని జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేస్తున్న మైత్రి క్లినిక్ వార్డు

మంగళవారం మాత్రమే

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలోని ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేస్తున్న మైత్రి క్లీనిక్‌లో ప్రతి మంగళవారం ఓపీ సేవలు అందనున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. వైద్యులు రాసిచ్చే మందులను కూడా ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి అందించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓపీ సేవలు అందించేలా వైద్య కళాశాల అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రాన్స్‌జెండర్ల కోసంప్రభుత్వం అందుకు అవసరమైన ఫర్నీచర్ ఏర్పాటు చేయడంతో, సిబ్బంది వార్డులో ఆకట్టుకునేలా పలు రంగులు వేస్తున్నారు.



మైత్రి క్లినిక్ వార్డు



సిద్దిపేట జీజీహెచ్ ఆసుపత్రి భవనం

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం సూచనమేరకు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నాం. వారి కోసం మంగళవారం అన్ని విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మైత్రి క్లినిక్‌లో ట్రాన్స్‌జెండర్లు వైద్య సేవలను అందిపుచ్చుకోవాలి. ప్రభుత్వ సూచన మేరకు త్వరలోనే అందుబాటులోకి తీసుకవచ్చి వైద్య సేవలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్, జీజీహెచ్

కరెంటు, తాగునీరు బంద్..

- బల్వాంతాపూర్ 'డబుల్' ఇళ్ల వద్ద ఉద్రిక్తత
- సామగ్రిని బయట పడేసిన గ్రామస్థులు
- తక్షణమే ఖాళీ చేయాలంటూ ఆగ్రహం
- విద్యుత్, నీళ్లను పునరుద్ధరించిన పోలీసులు, అధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ గంగరాజు

దుబ్బాక, సెప్టెంబరు 13 : దుబ్బాక మండలం బల్వాంతాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో గురువారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా ఇళ్లలో నివాసముంటున్న వారంతా ఖాళీ చేయాలంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డబుల్ ఇళ్లకు కరెంటు, నీటి సరఫరాను నిలిపివేశారు. సుమారు 20 ఇళ్లలో నివాసముంటున్న వారి కుళాయి మంచి నీటి పైపులైన్లను పగలగొట్టారు. శుక్రవారం ఆయా ఇళ్లలోని సామగ్రిని బయట పడేశారు. కొందరి ఇళ్లకు తాళాలు వేశారు. దీంతో గ్రామస్థులకు, డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న వారికి మధ్య వివాదం చోటుచేసుకున్నది. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయినా ఎవరూ వినకపోవడంతో తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ గంగరాజు చేరుకుని గ్రామస్థులను సముదాయించారు. వారం రోజుల్లో డబుల్ ఇళ్లను ఖాళీ చేయించి గ్రామసభ పెట్టి ఇళ్లను కేటాయిస్తామని హామినిచ్చారు. అనంతరం కరెంటు, మంచినీటిని పునరుద్ధరించారు.

ఇదీ సంగతి..

గ్రామంలో 2019లో 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. రెండు సార్లు అర్హులను ప్రకటించి వారికి ఇళ్లను అందజేయడంలో జాప్యమైంది. ఈ క్రమంలో రెండుసార్లు జాబితాపై వివాదం నెలకొంది. గ్రామంలో కేవలం ఐదుగురు మాత్రమే అర్హులున్నారని అప్పటి రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. అనర్హులు ఎక్కువగా ఉండటంతో 20 మంది పేర్లు ఎవరివి ప్రకటించాలో తేల్చలేదు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆక్రమించుకోవాలని పోటాపోటీగా పలు రాజకీయ పార్టీలు పిలుపునిచ్చాయి. దీంతో అర్హులు, అనర్హులు అనే తేడా లేకుండా కొందరు అందులో చేరిపోయారు. నాలుగేళ్లుగా అందులో స్థిరపడిపోయారు. మరమ్మతులు చేయించుకుని అందులోనే నివసిస్తున్నారు. స్థానిక ఎన్నికలు సమీపించడంతో గ్రామంలో మళ్లీ రాజకీయ వివాదం నెలకొంది. దీంతో తిరిగి డబుల్ ఇళ్ల వివాదం మొదటికి వచ్చింది. గత రెండు రోజులుగా గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

కళాశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి 7

ఆర్టీసీ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెను ప్రమాదం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 13: కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మోదినీపూర్ శివారులో ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్‌తో బస్సు ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. అయితే, డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్లితే.. కరీంనగర్ డిపోకు చెందిన రాజధాని డీలక్స్ బస్సు శుక్రవారం 10 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తోంది. మోదినీపూర్ శివారులోకి రాగానే బస్సు ఇంజన్‌లో పొగ రావడంతో డ్రైవర్ అప్రమత్తం అయ్యారు. అక్కడే బస్సు ఆపి పరిశీలించగా, ఇంజన్ భాగంలో మంటలు కనిపించాయి. దీంతో బస్సులోని ప్రయాణికులను కిందికి దింపేశాడు. తర్వాత పోలీసులకు, అగ్నిమాపక దళానికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను ఆర్పేశారు. అంతకు ముందు పోలీసులు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే, ఇంజన్‌లో ప్రారంభమైన మంటలతో బస్సు మొత్తం దట్టమైన పొగ కమ్ముకుంది.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రూ. 10 లక్షల కరెన్సీతో గణనాథుడికి పూజలు



గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం హుస్నాబాద్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయకుడికి రూ. 10 లక్షల కరెన్సీతో లక్ష్మీ గణపతి పూజ నిర్వహించారు. రూ. 500, రూ. 200, రూ.100, రూ. 50, రూ. 20, రూ. 10, రూ. 5కరెన్సీతో పాటు నాణేలతో అందంగా అలంకరించి పూజలు చేశారు.

- హుస్నాబాద్, సెప్టెంబరు 13

నవ భారత నిర్మాణమే బీజేపీ లక్ష్యం

- ప్రధాని మోదీ పాలనలో వేగంగా దేశాభివృద్ధి
- కేంద్ర ఐటీ శాఖ మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్
- సభ్యత్వ నమోదులో మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి : ఎంపీ రఘునందన్‌రావు 7

సైబర్ నిందితుడి అరెస్టు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 13 : ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసిన సైబర్ నిందితుడిని సిద్దిపేట సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన భీమిశెట్టి వెంకటరామ్ సిద్దిపేటలో పనిచేసే ఓ బ్యాంకు మేనేజర్‌కు వాట్సాప్, మెయిల్‌కు లింక్ పంపించాడు. ఇందులో పెట్టుబడులు పెడితే ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మబలికాడు. దీంతో సదరు బ్యాంక్ మేనేజర్ విడతల వారీగా గూగుల్ పే, ఫోన్ పే, ఆన్‌లైన్ నెట్ బ్యాంకింగ్ ద్వారా 25 రోజుల్లో రూ.80 లక్షల పంపించాడు. ఆ తర్వాత ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన సదరు బ్యాంక్ మేనేజర్ సైబర్‌సెల్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడికి చెందిన వివిధ బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేసి రూ.20లక్షలను రికవరీ చేసి మేనేజర్‌కు ఇప్పించారు. అనంతరం టెక్నాలజీని ఉపయోగించి నిందితుడిని శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడి వద్ద నుంచి రూ.50వేలు, సెల్ ఫోన్, రెండు బ్యాంకులకు సంబంధించిన చెక్కుబుక్కులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

ఈజీఎస్ అధికారులపై ఖేడ్ ఎమ్మెల్యే ఆగ్రహం

కల్హేర్, సెప్టెంబరు 13: మండలంలో నాటిన మొక్కల వివరాలు తెలపాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈజీఎస్ అధికారులను కోరగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన సంఘటన కల్హేర్‌లో జరిగింది. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కల్హేర్ ఎంపీపీ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, వ్యవసాయ, రెవెన్యూశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సీజన్‌లో మండలంలో నాటిన మొక్కల వివరాలు తెలపాలని, వాటిలో ఎన్ని బతికి ఉన్నాయనే వివరాలను కల్హేర్ ఈజీఎస్ ఈసీ వేణుగోపాల్, టీఏలు బన్సీలాల్, శ్రీనివాస్‌రెడ్డిలను ఎమ్మెల్యే కోరగా వారి వద్ద వివరాలు లేకపోవడంతో సమాధానం చెప్పలేకపోయారు. తప్పుడు రికార్డులు చూపిస్తున్నారా అని వారిపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వివరాలు అరగంటలో తీసుకురావాలని, వాటిని తనిఖీ చేస్తానని ఎమ్మెల్యే వారికి సూచించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం ముగించి వెళ్లిపోయారు. మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు తెలియజేయాలని, లేదంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. అంతకు ముందు సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ శివశ్రీనివాస్, ఎంపీడీవో రమేష్ బాబు, ఈజీఎస్ ఏపీవో శ్యాంకుమార్, కల్హేర్ మాజీ ప్యాక్స్ చైర్మన్లు వీర్‌శెట్టి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కామిని చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఆకట్టుకున్న వినాయకుల వేషధారణ

వినాయక నిమజ్జనం సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని నియోప్రగతి పాఠశాల విద్యార్థులు వినాయకుల వేషధారణ ఆకట్టుకున్నది. పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడిని, వినాయకుల వేషధారణతో ,చిన్నారుల నృత్యాలతో నిమజ్జనానికి తరలించారు.

నారాయణఖేడ్, సెప్టెంబరు 13

దుబాయ్‌లో మృతి.. స్వగ్రామానికి చేరిన మృతదేహం



అంత్యక్రియల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 13 : దుబాయ్‌లో మృతిచెందిన మెదక్ జిల్లా తిమ్మక్కపల్లికి చెందిన రాట్ల సూర్య నాయక్ మృతదేహం కోసం పదిహేను రోజులగా ఎదురుచూస్తుండగా శుక్రవారం స్వగ్రామానికి చేరుకున్నది. వివరాల్లోకి వెళితే.. రాట్ల సూర్య అబుదాబీలో మరణించాడని వార్త తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు, గ్రామస్థులు బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆశ్రయించారు. ఎంపీ వెంటనే స్పందించి భారత ప్రభుత్వ ఎంబీసీ, అబుదాబీలో ఒక అడ్వకేట్‌తో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని రాజా శ్రీనివాసరావు బృందానికి సూచించారు. రాజా శ్రీనివాసరావు బృందం, గల్ఫ్ జేఏసీ ఉపాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి వెంటనే స్పందించి మృతదేహాన్ని ఉచితంగా తేవడానికి కృషి చేశారు. శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఉదయం ఐదు గంటలకు చేరుకున్నది. అక్కడ నుంచి మృతుడి ఇంటికి అంబులెన్సు ద్వారా తీసుకొచ్చారు. మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు సహకరించిన అధికారులకు, రాజా శ్రీనివాస బృందానికి, ఎంపీ రఘునందన్‌రావుకు కుటుంబసభ్యులు ధన్యవాదాలు చెప్పారు. అంత్యక్రియలలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ వివాదంతో విసిగి.. రైతు ఆత్మహత్య

- నేతలతో అండతో తల్లి, చెల్లి చంపే ప్రయత్నం చేస్తున్నారని సెల్ఫీ వీడియో తీసి గడ్డిమందు తాగిన వ్యక్తి
- చికిత్స పొందుతూ మృతి
- మృతదేహంతో బైఠాయించిన గ్రామస్థులు





రోడ్డుకు అడ్డుగా అంబులెన్స్‌ను పెట్టి, ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, పున్న స్వామి(ఫైల్)

రామాయంపేట, సెప్టెంబరు 13 : తోబుట్టువుల భూ వివాదంలో విసిగిన రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సుతార్‌పల్లికి చెందిన పున్న స్వామి(45)కి తల్లి, చెల్లెళ్లతో భూ పంచాయితీ నడుస్తోంది. తల్లి, చెల్లి ఇద్దరు కాంగ్రెస్ నేతల అండతో తరచూ స్వామిని వేధించసాగారు. నాలుగు రోజుల క్రితం తన పౌల్ట్రీఫాంలో గడ్డిమందు తాగి సెల్ఫీ వీడియోలో తన చావుకు కారకులను బయట పెట్టాడు. నేతలను అడ్డు పెట్టుకుని తోబుట్టువులు తనను చంపే ప్రయత్నం చేస్తున్నారని.. ఇక తానే ఆత్మహత్య చేసుకుంటున్నాని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. అపస్మారక స్థితికి చేరిన అతన్ని కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మధ్యాహ్నం అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకురాగా.. గ్రామస్థులు రామాయంపేటకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. ఆరు గంటల పాటు ఆందోళన చేపట్టగా.. పోలీసులు నచ్చ చెప్పినా వినలేదు. దీంతో వాగ్వాదం నెలకొన్నది. సీఐ వెంకట రాజాగౌడ్ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో సాయంత్రం ధర్నా విరమించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో భద్రపర్చారు.

రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి

రామచంద్రాపురం, సెప్టెంబరు 13 : రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి దుర్మరణం పాలైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ సురేష కథనం ప్రకారం.. కొమురంభీం కాలనీలో నివాసముంటున్న శ్రీను(54) ఉస్మాన్‌నగర్‌లో ఇసుక వ్యాపారం చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం బైక్‌పై తన అడ్డాకు బయలుదేరాడు. ఎలియన్స్ ఫేస్ స్టేషన్, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పరు లారీ బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అడవి జంతువును తప్పించబోయి యువకుడు

హవేళిఘణపూర్, సెప్టెంబరు 13 : అడవి జంతువును తప్పించబోయి బైక్ పైనుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని సర్దన శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫరీద్‌పూర్ గ్రామానికి చెందిన దాసరి బ్రహ్మం కుమారుడు దాసరి సాయికుమార్(18) ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి, స్నేహితుడు గణేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై సర్దన గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా అడవి జంతువు రోడ్డుపైకి రావడంతో దానిని తప్పించబోయి బైక్ పైనుంచి వారు కింద పడ్డారు. సాయికుమార్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబీకులు క్షతగాత్రులను వెంటనే మెదక్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సాయికుమార్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుని తండ్రి బ్రహ్మం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

స్నేహితుడి వద్దకు వెళ్లొస్తానని.. రోడ్డు పక్కన మృతదేహమై కనిపించి..

జిన్నారం, సెప్టెంబరు 13: స్నేహితుడి దగ్గరికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లిన ఒకరు గాయాలై రోడ్డు పక్కన పడి మృతిచెంది కనిపించిన సంఘటన జిన్నారం మండల పరిధిలో వెలుగుచూసింది. ఎస్‌ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామానికి చెందిన సయ్యద్(47) ఈనెల గురువారం జిన్నారంలోని స్నేహితుడు సత్యనారాయణను కలువడానికి వెళ్లి తిరిగి రాలేదు. సయ్యద్ కోసం భార్య గౌసియా, స్నేహితుడు సత్యనారాయణలు ఫోన్‌చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో 13న సయ్యద్ ఆచూకీ కోసం ప్రయత్నించగా.. జిన్నారం శివారులోని అల్యూమినియం పరిశ్రమ సమీపంలో రహదారి పక్కన పడి తీవ్ర గాయాలై మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య గౌసియా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బైక్‌పై నుంచి పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య

దుబ్బాక, సెప్టెంబరు 13 : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం దుబ్బాకలోని డబుల్‌బెడ్‌రూం సముదాయంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ గంగరాజు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మర్కంటి నరేష్(37) వివిధ అవసరాల కోసం అప్పులు చేశాడు. అప్పులను తీర్చే మార్గం లేక ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపాలిటీ స్థలమని వాగ్వాదం

తూప్రాన్, సెప్టెంబరు 13: ఓ స్థలం విషయంలో వాగ్వాదం చోటు చేసుకున్న ఘటన తూప్రాన్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని పిట్టల లచ్చిగోరి ఎక్స్‌కవేటర్‌తో స్థలాన్ని చదును చేయిస్తుండగా కొందరు అక్కడకు చేరుకొని పనులు అడ్డుకున్నారు. ఇది పట్టా భూమి అని లచ్చిగోరి తెలపగా, మున్సిపాలిటీకి చెందిన స్థలమంటూ పనులను అడ్డుకున్న వారు అతడితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను సముదాయించారు. ఫిర్యాదులు చేయాలని, భూమి పత్రాలు తీసుకొని పోలీసుస్టేషన్‌కు రావాలంటు సూచించారు.

కళాశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి

మద్దూరు, సెప్టెంబరు 13 : కళాశాలలో మౌలిక వసతులను తక్షణమే ఏర్పాటు చేసేలా చూస్తామని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి తెలిపారు. శుక్రవారం డీఏవో రవీందర్‌రెడ్డితో కలిసి ఆకునూరు మురళి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కళాశాలలో నెలకొన్న సమస్యల్ని అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్‌తో పాటు విద్యార్థులు ఎంత మంది కళాశాలకు వస్తున్నారని అడిగి క్లాసు రూంలను పరిశీలించారు. కళాశాలలో కాంపౌండ్ వాల్‌తో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలపై ఆరా తీశారు. తక్షణమై ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. బడ్జెట్‌కు ఇబ్బంది లేదని, కాంట్రాక్టర్లతో రెండు నెలల్లో పనులు పూర్తి చేయించాలని, మళ్లీ వచ్చి చూస్తానని ఆకునూరు మురళి అన్నారు. అనంతరం మోడల్ స్కూల్‌ను సందర్శించి అధ్యాపకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోధన తీరుపై సబ్జెక్ట్ వారీగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని పైఅంతస్తులో జరుగుతున్న క్లాసురూంల పనులను పరిశీలించారు. వాటర్ లీకేజీలపై ఏఈని మందలించారు. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి, సూపరెండెంట్ మూర్తి ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

పరిశ్రమలున్నా.. పన్ను సున్నా

- అంతంత మాత్రంగానే వసూలు
- నిధులు లేక నీరసిస్తున్న జీపీ

మనోహరాబాద్, సెప్టెంబర్ 13 : అంగట్లో అన్ని ఉన్నా.. అన్న సామెత మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి సరిగ్గా సరిపోతుంది. ఈ గ్రామానికి పరిశ్రమల నుంచి ఆదాయం వచ్చే అవకాశం మెండుగా ఉన్నా.. గ్రామ పంచాయతీ కార్యాలయం ఇంకా అద్దె భవనంలోనే సాగుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కనీసం పారిశుధ్య పనులు చేపట్టేందుకు జీపీ వద్ద నిధులు లేక.. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. దీంతో సీజనల్ వ్యాధుల భయం ఆ గ్రామాన్ని వెంటాడుతోంది.

వందకుపైగా..

కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు వందకుపైగా చిన్నా పెద్దా పరిశ్రమలు ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం ఇక్కడ నాలుగు ఎకరాల్లో చిన్నా.. పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు గ్రామంలోని సుమారు 20 ఎకరాల్లో పరిశ్రమలు ఉన్నాయి. ఇవన్నీ చూసే పరిశ్రమల నుంచి గ్రామానికి పెద్ద ఎత్తున పన్ను రావాల్సి ఉంటుంది. వాస్తవానికి ఆయా పరిశ్రమల నుంచి సరిగ్గా పన్ను వసూలు చేస్తే గ్రామ పంచాయతీకి ఏటా రూ. 2కోట్ల వరకు ఆదాయం వస్తుంది. కానీ, ప్రస్తుతం పరిశ్రమల నుంచి కేవలం రూ. 90 లక్షలు మాత్రమే పన్నుల రూపంలో వస్తోంది. ఇక గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో జీపీ నిధులు, గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 65 లక్షలతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు.

ఇదీ జరుగుతున్నది..

కాళ్లకల్‌లో పరిశ్రమలకు ఏళ్ల క్రితం పన్ను మదింపు చేశారు. అప్పట్లో పన్నులు తక్కువగా ఉండగా.. ఇప్పుడు కొందరు పరిశ్రమలను విస్తరించారు. ఏళ్లుగా పన్ను మదింపు లేకపోవడంతో తక్కువగా వసూలవుతోంది. కొందరు అధికారులు, నేతలు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై తక్కువ మొత్తం పన్ను వచ్చేలా చేస్తున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది.

పన్నులు పూర్తిగా చెల్లించడం లేదు



కాళ్లకల్ మేజర్ జీపీ పరిధిలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల నుంచి పన్ను వసూలు చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. నిధులు లేక గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. అధికారులు స్పందించి పరిశ్రమల నుంచి పన్నులు వసూలు చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలి.

- సర్వీన్‌గౌడ్, గ్రామస్థుడు

అధికారుల సూచనల మేరకే పన్ను వసూలు



ప్రభుత్వ సూచనల మేరకు గతంలో ఉన్న మాదిరిగా పన్నులను వసూలు చేస్తున్నాం. 2018 వరకు గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి పన్నులను పెంచింది. ఐదేళ్లకు ఒకసారి పన్ను పెంచడం జరగాలి కాని, 1998 సంవత్సరం వరకు మాత్రమే పెంచినట్లు రికార్డులు ఉన్నాయి. పరిశ్రమల విస్తీర్ణం పెరిగిన విషయం వాస్తవమే.

- రాజు, కాళ్లకల్ పంచాయితీ కార్యదర్శి



కాళ్లకల్ గ్రామ శివారులోని ఓ పరిశ్రమ

ఆవర్తన పట్టికను అవపోసన పట్టింది

- దామరకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అరుదైన రికార్డు



సైన్స్ ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మం, విద్యార్థిని భవానిని అభినందిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

మర్కుక్, సెప్టెంబరు 13: సిద్దిపేట సమీకృత కలెక్టర్ భవన సముదాయ మీటింగ్‌హాల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్ కార్యశాల ముగింపు రోజున మర్కుక్ మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భవాని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారుల సమక్షంలో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఆవర్తన పట్టికలోని అన్ని మూలకాలను రికార్డ్ సమయంలో చదివి వినిపించి అందరినీ అబ్బురపరిచింది. మూడో ప్రయత్నంలో 12.15 సెకండ్ల సమయంలో ఆవర్తన పట్టికలోని 118 మూలకాలను చదవడం ఒక రికార్డుగా చెప్పవచ్చునని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అమ్మాయి ప్రతిభకు ముగ్ధుడయ్యానని, భవానికి తోడ్పాటునందించిన ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములును డీఈవో ప్రత్యేకంగా అభినందించారు.

నవ భారత నిర్మాణమే బీజేపీ లక్ష్యం

- ప్రధాని మోదీ పాలనలో వేగంగా దేశాభివృద్ధి
- రానున్న రోజుల్లో అతిపెద్ద పార్టీగా బీజేపీ
- యాపిల్, ఐఫోన్ల ఎగుమతి దేశంగా ఇండియా
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్
- సభ్యత్వ నమోదులో మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి : ఎంపీ రఘునందన్

గజ్వేల్/మెదక్ అర్బన్, సెప్టెంబరు 13: నవ భారత నిర్మాణమే బీజేపీ లక్ష్యమని, ప్రధాని మోదీ పాలనలో వేగంగా దేశాభివృద్ధి జరుగుతోందని కేంద్ర ఐటీ శాఖ మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్, మెదక్ జిల్లా కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతిపక్షంగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. రానున్న రోజుల్లో దేశంలో బీజేపీ అతిపెద్ద పార్టీ అన్నారు. గతంలో నూటికి 90 శాతం సెల్‌ఫోన్లను విదేశాల నుంచి దిగుమతి అయ్యేవని, ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్లల్లో యాపిల్, ఐఫోన్లను తయారు చేసి ఎగుమతి చేసే దేశంగా ఇండియా మారిందన్నారు. ప్రపంచంలో తయారవుతున్న మొబైల్స్‌లో 20 శాతం యాపిల్ ఫోన్లు ఇండియాలోనే తయారు చేస్తున్నారని, ఇదే ప్రధాని మోదీ సాధించిన ఘనతగా చెప్పుకొచ్చారు. అంతేకాకుండా యాపిల్ కంపెనీ ప్రారంభించిన తర్వాత 6.3 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు భర్తీ చేయగా.. ఇందులో 70 శాతం మంది మహిళలకు అవకాశం కల్పించిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని విమర్శించే వారికి ఇది కనబడడం లేదన్నారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అన్నదే బీజేపీ నినాదామన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ప్రతీ భారతీయుడు బీజేపీలో చేరాలన్నదే తమ అభిమతమన్నారు. ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విదేశాల్లో భారత్ ఆత్మగౌరవం, ఔన్నత్యాన్ని అభాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని నవాబుపేటలో నవోదయ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని శుక్రవారం మాజీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వంటిమామిడిలో మార్కెట్‌లో రైతుకు బీజేపీ సభ్యత్వాన్ని ఇస్తున్న రాజీవ్ చంద్రశేఖర్, ఎంపీ రఘునందన్

ప్రధానమంత్రి మోదీతోనే దేశ భవిష్యత్తు


గజ్వేల్/ములుగు, సెప్టెంబరు 13 : దేశ భవిష్యత్తు ప్రధానమంత్రి మోదీకే సాధ్యమవుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి మార్కెట్‌లో కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో కలిసి బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. మార్కెట్‌లో రైతుతో సభ్యత్వం చేయించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను వారు. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె పల్లెకు పార్టీని విస్తరింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పల్లె రమేష్‌యాదవ్, గురువారెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, భాగ్యలక్ష్మి, కృష్ణయాదవ్, మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సమీకృత మార్కెట్

గజ్వేల్, సెప్టెంబర్ 13 : గజ్వేల్ పట్టణంలో కోట్లాది రూపాయలను వెచ్చించి ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత మార్కెట్ అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పట్టణ నడిబొడ్డున ఉన్న సమీకృత మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతనంగా మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పడినా ఇప్పటివరకు దృష్టి సారించలేదు. ఇటీవల విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లను, కొమ్మలను విద్యుత్ శాఖ అధికారులు కొట్టివేయగా, వాటిని ఎక్కడికక్కడ కుప్పలుగా పారవేశారు. మార్కెట్లో కుళ్లిపోయిన కూరగాయలు, ఆకుకూరలను ఓ మూలకు పారేయడం, చెత్తనంతా ఒకచోట పోగు చేయడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇదే మార్కెట్‌లో పట్టణ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయగా అందులో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయాయి. ఇక రాత్రయితే చాలు మందు బాబులు యథేచ్ఛగా మద్యం సేవించి, బాటిళ్ల ఎక్కడికక్కడ పడేసి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని, నూతనంగా ఏర్పడిన పాలకవర్గం ఈ పరిణామాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



మద్యం సీసాలు



బురద గుంట



సమీకృత మార్కెట్‌లో చెత్త, పాడైపోయిన కూరగాయలు

టమాటా పంటలను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తొగుట, సెప్టెంబరు 13: తొగుట మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి 'తెగుళ్ల తంటా.. కన్నీళ్ల కంట' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం రావడంతో అధికారులు స్పందించారు. శుక్రవారం దుబ్బాక డివిజన్ హార్టికల్చర్ అధికారి రమేశ్ మండల వ్యవసాయ అధికారి మోహన్‌తో కలిసి మండలంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంట కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో పంట నష్టాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు పూర్తి నివేదిక అందజేస్తామని చెప్పారు. వారి వెంట ఏఈవో రాజేశ్ తదితరులు ఉన్నారు.



తుక్కాపూర్‌లో వర్షానికి దెబ్బతిన్న టమాటా పంటను పరిశీలిస్తున్న రమేశ్

ఎక్కడపడితే అక్కడే!

కాలుష్య జలాలు, వ్యర్థాల పారబోత

- వందల పరిశ్రమలున్నా.. ఒక్కట్రీట్‌మెంట్ ప్లాంట్ లేని వైనం
- శుద్ధి కేంద్రాలు లేక.. పారిశ్రామిక వ్యర్థాల ప్రవాహం
- ఆచరణకు నోచుకోని కుంటల శుద్ధి, ఈటీపీ ఏర్పాటు

జిన్నారం, సెప్టెంబరు 13 : వందల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఉన్న పారిశ్రామికవాడల్లో ఒక్క శుద్ధి కేంద్రం (ఈటీపీ) లేదు.. రసాయన వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా బహిరంగ ప్రాంతాలకు వదిలేయటంతో గ్రామాలు, జలాశయాలు కాలుష్యం బారిన పడుతున్నాయి. ఈ ప్రభావం స్థానిక గ్రామాల ప్రజలు, మూగజీవాలపై పడి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ఉమ్మడి జిన్నారం మండలంలోని 7 గ్రామ పంచాయతీల పరిధిలోని 300 వందలకుపైగా పరిశ్రమలుండగా వాటిలో 90 శాతం రసాయ పరిశ్రమలే. ఇందులో కొన్ని తరచూ కాలుష్య జలాలను బహిరంగా వదిలి వేయటంతో సమీప ప్రాంతాల నీటి వనరులు కలుషితమయ్యాయి. కొన్ని పరిశ్రమలు అనుమతి లేని ఉత్పాదనలు చేపడితే.. మరికొన్ని అధిక ఉత్పాదనలు జరిపి వాటి వల్ల వచ్చే రసాయక వ్యర్థాలకు శుద్ధి కేంద్రాలకు(ఈటీపీ, సీటీఈపీ)లకు తరలించే అవకాశం లేక పారవేతకుల పాల్పడుతున్నారు. రసాయనాలు తరలించే ట్యాంకర్లు పారిశ్రామిక వాడలు దాటగానే రహదారుల పక్కన పారవేయడం చేస్తున్నారు. గడ్డపోతారం అయ్యమ్మ చెరువుపై భాగంలో రసాయన జలాలు నిరంతరం పారుతుంటాయి. ఇక్కడ ఇటీవల ఓ పరిశ్రమ ఔట్‌లెట్ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇక వ్యర్థ రసాయన జలాలను శుద్ధి కేంద్రాలకు తరలిస్తే భారీగా ఖర్చు కావటం కూడా పారవేతలకు కారణం. ఒక్కో ట్యాంకరు రసాయన జలాలు శుద్ధి చేయాలంటే రూ.75 వేల నుంచి రూ.లక్ష 50 వేల వరకు ఖర్చు అవుతుంది. దీంతో డబ్బు కోసం కక్కుర్తి పడి కాలుష్య జలాలు పారవేసే కేటుగాళ్లతో కొన్ని పరిశ్రమలు చేతులు కలిపి ఎక్కడిక్కడ పారవేస్తున్నారు.

నిధులున్నా శుద్ధి కేంద్రాల ఏర్పాటు ఏదీ?

సమీపంలో వ్యర్థాల శుద్ధి కేంద్రం లేకపోవటం సమస్యకు ప్రధాన కారణం. నిత్యం ఇక్కడి నుంచి అనుమతి ఉన్న పరిశ్రమల వ్యర్థాలను జేఈటీఎల్ జీడిమెట్ల, పీఈటీఎల్ పటాన్‌చెరు, ఘన వ్యర్థాలు రాంకీ వేస్ట్‌మేనేజ్ మెంట్ ప్లాంట్‌లకు తరలిస్తున్నారు. మండలానికి దూరంగా శుద్ధి కేంద్రాలు ఉండటంతో పరిశ్రమల నుంచి వెళ్లే కాలుష్య జలాల ట్యాంకర్లు ఏ ప్రాంతాలకు వెళుతున్నాయో గుర్తించే వ్యవస్థ సక్రమంగా లేదు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల మధ్యే రసాయనాలు తరలించాలి. కానీ పారిశ్రామిక ప్రాంతాల్లో చాలా వ్యర్థ జలాల వాహనాలు రాత్రి వేళ కనిపిస్తున్నాయి. స్థానికంగా రసాయనాల శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్న అమలు చేయకపోవటంతో అక్రమార్కులకు కలిసివస్తుంది. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు సమయంలో వసూళ్ల చేసిన 2 శాతం నిధులలోంచి సుమారు రూ.12 కోట్లతో మండలంలో రెండు ఎఫ్లయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ఏర్పాటు చేపట్టాలనే ప్రతిపాదనలున్నా ఆచరణ ఎప్పుడో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇందులో బొల్లారం ఆసానికుంట శుద్ధి, ఇక్కడే ఈటీపీ ఏర్పాటు ప్రతిపాదనలు ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితవడంతో ప్రజలకు కాలుష్యం తప్పడం లేదు.



బొల్లారంలో కాలుష్య జలాలతో నిండిన ఆసానికుంట

ఎమ్మెల్యే గాంధీని అరెస్టు చేసేవరకూ ఉద్యమిస్తాం

- బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టులపై ఖండన



గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు



తొగుట మండలం గుడికందుల గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గజ్వేల్ సెప్టెంబర్ 13: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి దిగిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని అరెస్టు చేసే వరకూ బీఆర్‌ఎస్ తరఫున ఉద్యమిస్తామని ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేలు గాంధీ, కౌశిక్‌రెడ్డి మధ్యలో జరిగిన సంఘటనలు నేపథ్యంలో గజ్వేల్ పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులతో పాటు ప్రతాప్‌రెడ్డిని ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకియోద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

●**హుస్నాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీని తలపించే విధంగా పాలన సాగిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్‌ఎస్‌లో ఉన్నట్లా, లేక కాంగ్రెస్‌లో చేరినట్లా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

●**సిద్దిపేట రూరల్:** ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి జరుగుతున్నా పోలీసులు మిన్నకుండిపోయి.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులను శుక్రవారం తెల్లవారుజాము నుంచే ముందస్తు అరెస్టు చేసి సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో బీఆర్‌ఎస్ సీనియర్ జిల్లా నాయకుడు కుంభాల ఎల్లారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పడిగె ప్రశాంత్ ఉన్నారు. మాజీమంత్రి హరీశ్‌రావును, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడం రేవంత్‌రెడ్డి కుట్రేనని బీఆర్‌ఎస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు కొంపెల్లి పద్మ ఆరోపించారు.

●**తొగుట:** మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ గుడికందుల లోని రోడ్డుపై బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించారు. అంతకుముందు అదే గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డిని, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డితోపాటు పలువురిని అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

●**చేర్యాల:** చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేశారు.

●**రాయపోల్:** రాయపోల్ మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, మాజీ సర్పంచ్ రామచంద్రంగౌడ్, మాజీ ఎంపీటీసీ రాజుగౌడ్, నాయకులు వెంకట్‌గౌడ్, శ్రీధర్, బబ్బులు ఉన్నారు.

●**మద్దూరు:** మద్దూరు మండలంలో మాజీ ఎంపీటీసీలు సమ్మయ్య పరశురాములు, నర్సింహులు, మాజీసర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు సాయిలు, నాగయ్య, శ్రీను, అన్నేజు శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

●**దౌల్తాబాద్:** బీఆర్‌ఎస్ దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు రహీమొద్దీన్ ఆధ్వర్యంలో హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డికి మద్దతుగా మేడ్చల్‌కు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులను ఎస్‌ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్ అరెస్ట్ చేశారు.

●**చిన్నకోడూరు:** చిన్నకోడూరు మండలంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కామిని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, బీఆర్‌ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

●**హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ.అన్వర్, మాజీ ఎంపీపీలు ఆకుల వెంకట్, లక్ష్మి పాల్గొన్నారు.

●**దుబ్బాక/మిరుదొడ్డి:** రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతుందని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి, మిరుదొడ్డి ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజు, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, జిల్లా నాయకుడు లింగం మండిపడ్డారు. దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు కైలాస్, భూంరెడ్డి, కృష్ణ, ప్రభాకర్, అంజిరెడ్డి, శ్రీనివాస్, రాములును అరెస్ట్ చేశారు.

●**సిద్దిపేట క్రైం:** మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్టుకు నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా సిద్దిపేట టౌన్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు మాట్లాడారు.

●**కొండపాక:** కొండపాకలో రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ రాగల దుర్గయ్యను త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిమ్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రవీందర్‌ను కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ తరలించారు. కొండపాకకు చెందిన బీఆర్‌ఎస్వీ నాయకుడు మారబోయిన ప్రశాంత్‌గౌడ్‌ను తార్నాక పోలీసులు అరెస్టు చేశారు.

●**కోహెడ:** కోహెడ మండలంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఆవుల మహేందర్, మాజీ ఎంపీటీసీలు కుమారస్వామి, నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ యాద అశోక్, నాయకుడు వంశీధర్‌రెడ్డి, శంకర్, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, తిప్పారపు అనిల్, రాజశేఖర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

●**బెజ్జంకి:** బెజ్జంకి మండలంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజయ్య, మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, మొండయ్య, నాయకులు లక్ష్మణ్, రాజిరెడ్డి, నరేష్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి మాట్లాడారు.

●**నంగునూరు:** హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు అనగోని లింగంగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, వెంకటరెడ్డిలు తీవ్రంగా ఖండించారు. నంగునూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

●**సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలానికి చెందిన తాజా మాజా సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులను త్రీటౌన్ పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు.

●**మర్కుక్:** మర్కుక్ మండలంలో మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు మేకల కనకయ్య, మాజీ సర్పంచులు అరెస్ట్ చేశారు.

బైక్ దొంగ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీబాబు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 13: బైక్‌ల దొంగను సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ లక్ష్మీబాబు వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చెందిన ఇనుప స్వామి సిద్దిపేటకు వచ్చి అంబేడ్కర్‌నగర్‌లో అద్దెకుంటూ మేస్త్రీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. మేస్త్రీ పని ద్వారా వచ్చే డబ్బులు తాగుడుకు, జల్సాలకు సరిపోకపోవడంతో బైక్‌లను దొంగతనం చేయడం ప్రారంభించాడు. రెండునెలల క్రితం సిద్దిపేటలో రెండు బైక్‌లను దొంగతనం చేశాడు. ఆ కేసులో వన్‌టౌన్ పోలీసులు బైక్‌లను రికవరీ చేసి నిందితుడిని జైలుకు పంపించారు. ఈనెల 11న జైలు నుంచి వచ్చిన స్వామి అదేరోజు సాయంత్రం సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రి వద్ద పార్కు చేసిన (టీఎస్ 36 ఎస్ 1469) నంబరు గల బైక్‌ను దొంగతనం చేశాడు. తర్వాత అమ్ముకుందామని పెద్దచీకోడ్‌లోని తన ఇంటి వద్ద దాచిపెట్టాడు. అదేరోజు రాత్రి సిద్దిపేటలోని సందీప్ హాస్పిటల్ వద్ద పార్కు చేసిన (టీఎస్ 36 సీ 0287) నంబరు గల బైక్‌ను కూడా దొంగిలించి స్వగ్రామానికి తీసుకెళ్లాడు. సందీప్ హాస్పిటల్ దగ్గర దొంగిలించిన బైక్‌ను సిద్దిపేటలో అమ్ముదామని వస్తున్నాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద వన్‌టౌన్ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారణ చేయగా రెండు బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని స్వామిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కానిస్టేబుల్ సస్పెండ్

నంగునూరు, సెప్టెంబరు 13: నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎ.శంకర్‌ను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్‌శాఖలో సీసీఏ రూల్స్ అతిక్రమించి క్రమశిక్షణారహితంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణల మేరకు విచారణ చేపట్టి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌శాఖలో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సీపీ సూచించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 13: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కొన్నిరోజుల నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 15 మంది పట్టుబట్టారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో పరచగా.. సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు 15 మందికి రూ.22 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనం పట్టివేత

కోహెడ, సెప్టెంబరు 13: మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో పిల్లివాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కొంతకాలంగా ఎర్రవెల్లి పరశురాములు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నామని ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. ఇసుక లోడ్‌తో ఉన్న బొలెరో వాహనాన్ని తహసీల్దార్‌కు అప్పగించామని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి: సీడీపీవో



మాట్లాడుతున్న సీడీపీవో సరిత

రాయపోల్, సెప్టెంబరు 13: గర్భిణులు, బాలింతలతో పాటు ప్రతిఒక్కరూ విధిగా పోషకాహారం తీసుకోవాలని గజ్వేల్ సీడీపీవో సరిత సూచించారు. శుక్రవారం రాయపోల్ మండలం వడ్డెపల్లిలో జరిగిన మండల స్థాయి పోషణ మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. చిరుధాన్యాలు, కూరగాయలు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం పలువురు మహిళలకు సామూహిక సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, శబానా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్జీటీల సమస్యలను పరిష్కరించాలి: యూటీఎఫ్

గజ్వేల్, సెప్టెంబరు 13: ఎస్జీటీల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వి. సత్యనారాయణ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ గజ్వేల్ మండల కమిటీ ఆధ్వర్యంలో పలు పాఠశాలలను శుక్రవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ నిరంతరం పనిచేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం తానిచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానం రద్దుచేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్, జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్‌కిరణ్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కమిటీ నుంచి దామోదర్, మల్లు రవిని తొలగించాలి'

చిన్నకోడూరు, సెప్టెంబరు 13: ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మంత్రి దామోదర రాజనరసింహ, ఎంపీ మల్లు రవిని తొలగించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడుమల్ల సత్తయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చిన్నకోడూరులో ఆయన పోరాట సమితి సభ్యులతో కలిసి మాట్లాడారు. కమిటీలో వారు ఉంటే మాలలకు న్యాయం జరగదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ కటికం రవి సభ్యులు రాజయ్య, అనిల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 13: హుస్నాబాద్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సంఘ జిల్లా అధ్యక్షుడు ఏ.శశిధర్‌శర్మ హాజరయ్యారు. అధ్యక్షుడిగా కొలుగూరి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప రాజయ్య, అసోసియేట్ అధ్యక్షుడు ఉప్పుల వేణుగోపాల్, మహిళా ఉపాధ్యక్షురాలుగా అరుణాదేవి, మహిళా కార్యదర్శిగా కె.శ్రీలలిత, కార్యదర్శిగా వెంకటమల్లులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పంజ రాజమల్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రాసేనారెడ్డి, లావుడ్య కిషన్‌నాయక్, బాల్‌రెడ్డి, రెమిడి లింగారెడ్డి, కొండి రవీందర్, సాదుల రవీందర్, సుభాష్ తదితరులున్నారు.

సిద్దిపేటకు చేరుకున్న శబరి మహాపాదయాత్ర

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 13: కామారెడ్డి రతాల రాంరెడ్డిలోని కాల భైరవ స్వామి ఆలయం నుంచి మొదలైన అయ్యప్పస్వాముల శబరి మహాపాదయాత్ర శుక్రవారం సిద్దిపేటకు చేరుకుంది. అయిత నారయణస్వామి, దుద్దెడ అశోక్‌గౌడ్ స్వామి సహాయకులుగా కన్నెస్వామి జనార్ధన్‌రెడ్డిస్వామి రాజుగురు స్వామి ఆశీస్సులతో యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేటకు వచ్చిన సందర్భంగా రత్నాకర్, బాల్‌రాజు స్వాగతం పలికి, జెండా ఊపి యాత్ర ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ముగిసిన ఎస్జీఎఫ్ క్రీడలు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక, సెప్టెంబరు 13: కొండపాకలో జరుగుతున్న మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో మొదటి బహుమతి దుద్దెడ టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ విద్యార్థులు, రెండో బహుమతి కొండపాక మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. అండర్-14 కబడ్డీ విభాగంలో మొదటి బహుమతి జడ్పీహెచ్‌ఎస్ సిరసనగండ్ల విద్యార్థులు, రెండో బహుమతి కొండపాక బాలుర పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో కొండపాక కేజీబీవీ విద్యార్థులు మొదటి బహుమతి, సిరసనగండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండో బహుమతి పొందారు. అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో మొదటి బహుమతి కొండపాక కేజీబీవీ విద్యార్థులు, రెండో బహుమతి సిర్సనగండ్ల పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు కొండపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్, బందారం పాఠశాల హెచ్‌ఎం రామచంద్రం, పీడీ నర్రా భాస్కర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

'విజేత'లో షీటీమ్ ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు

గజ్వేల్, సెప్టెంబరు 13: గజ్వేల్ పట్టణంలోని విజేత డిగ్రీ కాలేజ్ ఆవరణలో షీటీమ్ ఫిర్యాదుల బాక్స్‌ను గజ్వేల్ షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్‌ఐ శ్రీరాములు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులను ఎవరైనా అవహేళన చేసినా, ఇబ్బందులకు గురిచేసినా ఒక చిట్టి రాసి అందులో వేయాలని సూచించారు. చిట్టి రాసిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. బాక్స్‌కు సంబంధించిన లాక్ అండ్ కీ షీటీమ్ బృందం వద్ద ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఇబ్బందులకు గురయ్యే మహిళలు, విద్యార్థినులు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమాచారం

టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా అందె రామచంద్రం

మిరుదొడ్డి: టీపీటీఎఫ్ మిరుదొడ్డి మండలాధ్యక్షుడిగా అందె రామచంద్రంను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, ఉపాధ్యక్షులుగా జగన్‌మోహన్‌రెడ్డి, రాజాగౌడ్, శ్రీనివాస్, సతీష్, ఉపాధ్యక్షురాలిగా విద్యారాణి, కార్యదర్శులుగా చంద్రమౌళి, శ్రీకాంత్, సురేష్, రమేష్, మహిళ కార్యదర్శిగా కవిత, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనాథ్, విజయ్‌కుమార్, బుచ్చిరెడ్డిలను ఎన్నుకున్నారు.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

సిద్దిపేట కల్చరల్: ఉన్నత విద్యలో రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కించుకున్న డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మధుసూదన్‌ను శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు.

సామూహిక కుంకుమార్చనలు

చేర్యాల/తొగుట/ధూళిమిట్ట: వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో కుంకుమార్చనలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గణనాథుడితో పాటు అమ్మవారిని స్మరిస్తూ కుంకుమాభిషేకం చేశారు. తొగుటలో గాంధీ విగ్రహం వద్ద నెలకొల్పిన వినాయక విగ్రహం వద్ద 20 మంది మహిళలు కుంకుమార్చన చేశారు. ధూళిమిట్టలో నవచైతన్య యూత్ ఆధ్వర్యంలో ఇందిర కాలనీలో కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద కుంకుమార్చన నిర్వహించారు.

పాడి కౌశిక్‌రెడ్డిని నగర బహిష్కరణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

దుబ్బాక/మిరుదొడ్డి సెప్టెంబరు 13: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని నగర బహిష్కరణ చేయాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధిమచ్చ శ్రీనివాస్, దుబ్బాక బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ డిమాండ్ చేశారు. దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లోని కాంగ్రెస్ కార్యాలయంలో వేర్వేరుగా మాట్లాడారు.

●**కొండపాక:** రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న కౌశిక్‌రెడ్డి జాగ్రత్తగా ఉండాలని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వాసరి లింగారావు హెచ్చరించారు. శుక్రవారం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

●**సిద్దిపేట టౌన్:** రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే ఖబర్దార్ అంటూ కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ హెచ్చరించారు. శుక్రవారం సిద్దిపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో అత్తుఇమామ్ మాట్లాడారు.

●**సిద్దిపేట అర్బన్:** బ్లాక్ మెయిల్ చేసి గెలిచిన కౌశిక్‌రెడ్డి పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడటం మానుకోవాలని కాంగ్రెస్ అర్బన్ మండలాధ్యక్షుడు కొలిమి బిక్షపతి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఇకనైనా బీఆర్‌ఎస్ నాయకులు డ్రామాలు ఆపాలని అన్నారు.

ఉత్తమ సేవలకు దక్కిన గౌరవం



ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాన్ని అందజేస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

మర్కుక్/బెజ్జంకి, సెప్టెంబరు 13: ఉపాధ్యాయులు చేసిన సేవలకు సత్కారాల రూపంలో గౌరవం దక్కిందని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్ నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ చైర్మన్ ఎస్.నరసింహారెడ్డి, సెక్రటరీ కరుణాకర్‌రెడ్డి, కల్చరల్ వింగ్ చైర్మన్ కే. చంటి పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బెజ్జంకి మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన తిరుపతిరెడ్డి సన్మానంలో శుక్రవారం డీఈవో పాల్గొని మాట్లాడారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



సిద్దిపేట కల్చరల్: హిందీ దివస్ అనే అక్షరాలను చూపిస్తున్న విద్యార్థినులు

గజ్వేల్/తొగుట/మద్దూరు/సిద్దిపేట కల్చరల్/దౌల్తాబాద్, సెప్టెంబరు 13: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ అమలాదేవి ఆధ్వర్యంలో హిందీ దివస్‌ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ హాజరై, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్. గణపతిరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటేష్, డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. తొగుట మండలం గుడికందులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు హిందీ భాషలో క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస, కవితల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో ముందస్తుగా శుక్రవారం హిందీ దివస్ నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, నాటిక, కవిత పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియల్ జడ్పీ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ పండిట్ ఉపాధ్యాయుడు అఫ్జల్ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు.

బస్సుల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు, ప్రజలు

రాయపోల్, సెప్టెంబరు 13: మరమ్మతుల కోసం రెండేళ్ల క్రితం రోడ్డును తవ్వారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు దెబ్బతినడంతో గజ్వేల్-చేగుంట మధ్యలో నడిచే బస్సులను కొన్ని గ్రామాలకు నిలిపేశారు. దీంతో రాయపోల్ మండలంలోని రామారం, గొల్లపల్లి, సయ్యద్‌నగర్ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకుండాపోయిందని శుక్రవారం మూడుగ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు గజ్వేల్-చేగుంట రహదారిపై గుర్రాలసోఫా వద్ద ధర్నా చేపట్టారు. దీంతో రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎస్‌ఐ రఘుపతి అక్కడికి చేరుకుని విద్యార్థులకు ప్రజలకు నచ్చజెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాల్సిందిగా కోరారు. త్వరలోనే ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మేనేజర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

సైక్లింగ్ పోటీలకు విద్యార్థినులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 13: సౌత్ జోన్ మహిళా సైక్లింగ్ పోటీలకు మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ విద్యార్థినులు కుచ్చుల రాగిణి (బైపీసీ సెకండియర్), బాసంపల్లి వైష్ణవి (బైపీసీ సెకండియర్) ఎంపికైనట్లు శుక్రవారం పాఠశాల ప్రిన్సిపల్ పద్మలత తెలిపారు. ఈనెల 14, 15న నిజామాబాద్ జిల్లాలో జరిగే కేలో ఇండియా ఉమెన్ లీగ్ రోడ్ రేస్ సైక్లింగ్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపల్ పద్మలత, ఫిజికల్ డైరెక్టర్ గుండి ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలి: స్వరూపారాణి

చేర్యాల/మద్దూరు, సెప్టెంబరు 13: పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మునిసిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి సువర్ణసన్ తెలిపారు. శుక్రవారం మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో సీజనల్ వ్యాధులపై ఇంటికి తిరిగి జ్వర సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ మాధవ్ జాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబం తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం మల్లేశ్వరి, ఆశాలు, అంగన్‌వాడీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏమమ్మా.. వసతి గృహం సదుపాయాలు బాగున్నాయా

- ఆరాతీసిన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 13: ఏమమ్మా.. వసతి గృహంలో సదుపాయాలు బాగున్నాయా.. సమయానికి భోజనం చేస్తున్నారా అంటూ సిద్దిపేట పట్టణం మణికంఠనగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్నవారిని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిరాశ్రయులుగా ఉన్నవారికి వసతి గృహాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం నర్సాపూర్ మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం నిర్వహణ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహం నిర్వహణ, ఎర్ర చెరువులో ఉన్న గుర్రపు డెక్క తొలగింపు పనులను, గణేష్ నవరాత్రుల సందర్భంగా నిమజ్జనం ఏర్పాట్లను, పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద గల వీధి విక్రయదారులు సముదాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయికృష్ణ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐది కీలకపాత్ర: మంద పవన్



బైరాన్‌పల్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ధూళిమిట్ట, సెప్టెంబరు 13: రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐది కీలక పాత్ర అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో అమరవీరుల స్థూపం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బురుజు వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి 4,500 మంది కమ్యూనిస్టులు రక్తాలు చిందించి 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర సీపీఐ పార్టీదేనన్నారు. సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో 76వ వార్షికోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కృష్ణపురం లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈరు భూమయ్య, మద్దూర్ మండల కార్యదర్శి జంగిలి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల కోసం పాటుపడిన వ్యక్తి సీతారాం ఏచూరి



చేర్యాల: ఏచూరి సంతాపసభలో నివాళులర్పిస్తున్న మల్లారెడ్డి తదితరులు

చేర్యాల/దుబ్బాక, మిరుదొడ్డి/చిన్నకోడూరు/కొండపాక, సెప్టెంబరు 13: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి తన తుదిశ్వాస వరకు కష్టజీవుల వెట్టిచాకిరీ విముక్తికోసం పాటుపడ్డాడని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం చేర్యాలలోని పార్టీ కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. పార్టీ నాయకులు యాదవరెడ్డి, శశిధర్, రవికుమార్ ఉన్నారు. దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంతోపాటు అక్బర్‌పేట చౌరస్తాలో ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలస్వామి, జిల్లా కోశాధికారి భాస్కర్ పూలమాలవేసి నివాళులర్పించారు. చిన్నకోడూరులో ఏచూరి చిత్రపటానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. కొండపాక మండలం వెలికట్ట క్రాస్‌రోడ్డు వద్ద సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

'ముగ్గురు పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలి'

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 13: ముగ్గురు పిల్లలు ఉన్నవారికి కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలని దళిత సంఘాల నాయకుడు ఎర్రోళ్ల దాస్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను దళిత సంఘాల నాయకుల హైదరాబాద్‌లో కలిసి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషిచేస్తానని తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చినట్లు దాస్ తెలిపారు.